పీహెచ్‌సీ ప్రారంభమెన్నడో..!

- 5 నెలలైనా ప్రారంభానికి నోచుకోని కళ్లేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం
- పట్టించుకోని అధికారులు, నాయకులు


నూతనంగా నిర్మితమైన కళ్లేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

శ్రీకాకుళం రూరల్:

మండల పరిధిలోని కళ్లేపల్లి పంచాయతీలో నూతనంగా నిర్మించిన పీహెచ్‌సీ ప్రారంభానికి నోచుకోవడం లేదు. కళ్లేపల్లి ప్రధాన పంచాయతీకి అనుసరించి 10 పంచాయతీలకు గాను 23 గ్రామాలకు అనుసంధానమైన ఈ పీహెచ్‌సీ పూర్తయ్యి 5 నెలలైనా ప్రారంభానికి చర్యలు తీసుకోవడం లేదు. అటు అధికారులు, ఇటు కూటమి నేతలు ఒకరిపై ఒకరు కారణాలు చెబుతూ రోజులు గడిపేస్తున్నారు. దీంతో పరాయి పంచనే పీహెచ్‌సీ నడపాల్సిన దుస్థితి నెలకొంది.

తుప్పుపడుతున్న వస్తువులు

గత ప్రభుత్వంలో పీహెచ్‌సీకి మాజీమంత్రి ధర్మాన ప్రసాదరావు నేతృత్వంలో రూ.2.60 కోట్లు మంజూరు చేశారు. పనులు చివరి దశకు చేరుకున్న తరుణంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. అనంతరం పనులు పూర్తి చేసినా సేవలకు వినియోగించడం లేదు. దీంతో ఇప్పటికే పీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన ఏసీలు, విలువైన వస్తువులు దుమ్ముధూళితో నిండిపోయాయి. కిటికీలు, తలుపులు తుప్పుపట్టే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

త్వరితగతిన ప్రారంభించాలి



కళ్లేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పనులు పూర్తవ్వడంతో ప్రారంభానికి సిద్ధంగా ఉంది. ఇది ప్రారంభమైతే మరిన్ని ఓపీలు పెరిగే అవకాశం ఉంది. సుముద్ర తీర ప్రాంత ప్రజలు అత్యవసర చికిత్సల నిమిత్తం శ్రీకాకుళం నగరానికి వెళ్లాల్సిన అవసరం ఉండదు. అన్ని సేవలు, చికిత్సలు ఇక్కడే అందుబాటులోకి వస్తాయి. అందువలన త్వరితగతిన ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలి.

– గంగు నరేంద్రకుమార్, సర్పంచ్, కళ్లేపల్లి

ప్రస్తుతం అరకొర సేవలే



మా కళ్లేపల్లి గ్రామంలో నూతనంగా నిర్మితమైన పీహెచ్‌సీ దాదాపు 10 పంచాయతీల్లోని 23 గ్రామాల ప్రజలకు అత్యవసరం. ఇది ప్రారంభిస్తే చుట్టుపక్కల ప్రజలకు నాణ్యమైన సేవలు అందుతాయి. అధికారులు, నాయకులు చర్యలు తీసుకొని ప్రారంభించాలి. ప్రస్తుతం నిర్వహిస్తున్న పీహెచ్‌సీలో అరకొర వైద్యసేవలే అందుతున్నాయి.

– మూకళ్ల తాతబాబు, ఏఎంసీ మాజీ చైర్మన్, కళ్లేపల్లి

పనులు చేయాల్సి ఉంది



కళ్లేపల్లి పీహెచ్‌సీ ప్రారంభమైతే ఓపీలు పెరుగుతాయి. నూతన భవనంలో ఇంకా చిన్నచిన్న పనులు చేయాల్సి వుంది. బయో మెడికల్ వేస్టేజ్ రూమ్‌లు కట్టాల్సి ఉంది. ఈ పీహెచ్‌సీ మొత్తానికి 14 పోస్టులకు గాను, కేవలం 7మంది మాత్రమే విధులు నిర్వహిస్తున్నాం. ప్రారంభమైన నాటికి పూర్తిస్థాయిలో సిబ్బంది ఉంటే చాలా మంచిది.

– చిరంజీవి నాయుడు, వైద్యాధికారి

అర్జునవలస హైస్కూల్లో స్మార్ట్ క్లాస్‌రూమ్ ఏర్పాటు


ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎంఈవోలు, సేవా సంస్థ సభ్యులు

రణస్థలం: మండలంలోని అర్జునవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన స్మార్ట్ క్లాస్‌రూమ్‌ను ఎంఈవోలు ఎ.త్రినాథరావు, లావణ్య, యూత్ క్లబ్ బెజ్జిపురం ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎం.ప్రసాద్ ప్రారంభించారు. యూత్ క్లబ్ బెజ్జిపురం స్వచ్ఛంద సేవా సంస్థ, ఇండియా లిటరసీ ప్రాజెక్ట్ బెంగళూరు సహకారంతో ఎడ్యుకేట్ ఫార్వర్డ్ నేతృత్వంలో లక్ష రూపాయల విలువైన ప్రొజెక్టర్, ల్యాప్‌టాప్, స్క్రీన్, స్పీకర్స్ అందజేశారు. కార్యక్రమంలో ఐఎల్‌పీ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ పి.మాధవి, ప్రధానోపాధ్యాయుడు బి.భాస్కరరావు, పాఠశాల సెక్రటరీ సీహెచ్ జనార్దన్‌రావు, యూత్ క్లబ్ నిర్వాహకులు వై.శంకరరావు, ఎ.రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్య రహిత సమాజమే లక్ష్యం


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

శ్రీకాకుళం అర్బన్: మాదకద్రవ్యాల రహిత జిల్లాగా శ్రీకాకుళంను రూపొందిద్దామని భారతీయ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ తెలంగాణ – ఆంధ్రప్రదేశ్ రీజనల్ హెడ్ కొంక్యాన వేణుగోపాల్ అన్నారు. శ్రీకాకుళం ఎన్జీవో కార్యాలయంలో బీహెచ్‌ఆర్‌సీ జిల్లా అధ్యక్షుడు రౌతు సూర్యనారాయణ ఆధ్వర్యంలో శనివారం డ్రగ్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా 'మత్తుకు బానిస కావొద్దు – భవిష్యత్తును నాశనం చేసుకోవద్దు' పేరిట పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సభ్యులు జెన్ని శ్రీనివాసరావు, సంతోష్, హేమంత్, ప్రసాద్, ఎండీయూ ఆపరేటర్స్ ప్రతినిధులు రామారావు, శివ, మాధవ్, అప్పారావు, సురేష్, శంకర్, కిరణ్, శ్రీను, జగన్, ఈశ్వర్, రాజా, వరుణ్, నరేష్ పాల్గొన్నారు.

ప్రాణహాని ఉందంటూ..



కుమార్తెతో ఎస్పీ కార్యాలయం వద్ద గోవిందరాజులు

శ్రీకాకుళం క్రైమ్ : 89 ఏళ్ల వయసులోనూ తనకు ప్రాణహాని ఉందని, పోలీసులు రక్షణ కల్పించాలని నాగావళి హోటల్ షేర్ హోల్డర్ వరద వెంకట గోవిందరాజులు వేడుకున్నారు. ఈ మేరకు శనివారం కుమార్తెతో కలిసి జిల్లా పోలీసు కార్యాలయానికి వచ్చి ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డికి విన్నవించుకున్నారు. ఏడాదిన్నర కాలంగా 80 ఫీట్‌రోడ్డు సమీపంలోని ఓ అద్దె ఇంట్లో చేతికర్ర, రెండు డ్రెస్సులతోనే జీవిస్తున్నట్లు చెప్పారు. నాగావళి హోటల్‌లోని పెంట్‌హౌస్‌లో తాను నివసించేందుకు గత నెల 12న జిల్లా కలెక్టర్ అనుమతులు జారీ చేశారని గుర్తు చేశారు. దీనిపై ఎస్పీ స్పందిస్తూ చట్టపరంగా రక్షణ కల్పిస్తామని భరోసా ఇచ్చారు.

పింక్ టాయిలెట్ల ఏర్పాటుకు భూమిపూజ

శ్రీకాకుళం అర్బన్: మహిళల సౌకర్యార్థం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో పింక్ టాయిలెట్ల ఏర్పాటుకు శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ ఆదేశాల మేరకు డివిజన్ ఇన్‌చార్జి కెల్లా కొండలరావు శనివారం భూమిపూజ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి.కుమార్‌రాజు, డిప్యూటీ లైబ్రేరియన్ వి.వి.జి.ఎస్ శంకరరావు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అందరి సహకారంతోనే పరిసరాల పరిశుభ్రత


శ్రీకాకుళం రూరల్: స్వచ్ఛ ప్రతిజ్ఞ చేస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్


ఎచ్చెర్ల క్యాంపస్: చెత్తాచెదారాలు తొలగిస్తున్న విద్యార్థులు


జి.సిగడాం: పెంట గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం


ఎచ్చెర్ల: బుడుమూరు ఉన్నత పాఠశాలలో..


శ్రీకాకుళం రూరల్:నైరా ప్రాథమిక పాఠశాల వద్ద చెత్త తగలబెడుతున్న దృశ్యం

శ్రీకాకుళం రూరల్: పరిసరాల పరిశుభ్రతకు అందరి సహకారం అవసరమని వక్తలు పిలుపునిచ్చారు. సింగుపురం, కిష్టప్పపేటలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివాస్ కార్యక్రమం నిర్వహించారు. శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో జాతీయ సేవాపథకం ఆధ్వర్యంలో స్వచ్ఛ క్యాంపస్ నిర్వహించారు. పరిసరాలను పరిశుభ్రం చేశారు. ప్రిన్సిపాళ్లు అనురాధ, ఉదయ్‌భాస్కర్, రాజశేఖరరావు, జిల్లా ఎన్‌ఎస్‌ఎస్ సమన్వయకర్త వనజ, విద్యార్థులు పాల్గొన్నారు.

జి.సిగడాం: గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు అందరూ సహకరించాలని మండల పరిషత్ ప్రత్యేకాధికారి రాజేంద్ర ప్రసాద్‌బాబు కోరారు. శనివారం పెంట గ్రామంలో సర్పంచ్ పున్నాన సోనియా ఆధ్వర్యంలో స్వచ్ఛాంధ్ర– స్వచ్ఛ దివాస్ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గుంటముక్కల రామకృష్ణారావు, ఎంఈఓ ముళ్ల శ్రీనివాసరావు, ఎంపీటీసీ మక్క శ్రీలత, నీటి సంఘం అధ్యక్షురాలు మీసాల విజయలక్ష్మి, ప్రధానోపాధ్యాయులు మజ్జి మదన్ మోహన్, ఏపీఎం రెడ్డి రామకృష్ణంనాయుడు, ఏపీఓ చోళ్ల సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శులు పొట్నూరు సురేష్‌కుమార్, ఏఎన్‌ఎం జి.భవాని, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ఎచ్చెర్ల: లావేరు మండలం బుడుమూరు ఉన్నత పాఠశాలలో స్వచ్ఛ భారత్ నిర్వహించారు. హెచ్‌ఎం శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి అప్పలనాయుడు, ఉపాధ్యాయులు పూజారి గోవిందరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం రూరల్: నైరా ప్రాథమిక పాఠశాలలో పరిసరాల పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పి.వి.ఎస్.ఎన్.మూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మోడల్ స్కూల్/జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి ఏడాది ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ అప్పాజీరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025– 26 విద్యా సంవత్సరానికి గాను ఈ నెల 17 నుంచి మే 22 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనున్నట్లు చెప్పారు. బీసీ, ఓసీ, ఈడబ్ల్యూఎస్ విద్యార్థులు రూ.200, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.150 చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఎంపీసీ, బైపీసీ గ్రూపులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు.

ఘనంగా బాలపార్వతమ్మ ఉత్సవాలు

ఎచ్చెర్ల: చిలకపాలెంలో శనివారం బాలపార్వతమ్మ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. మూడు రోజుల పాటు జరగనున్న ఈ ఉత్సవాల కోసం ఆలయాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారి విగ్రహం వద్ద కుంకుమ పూజలు చేశారు.

పశువులు పట్టివేత

రణస్థలం: మండలంలోని జె.ఆర్.పురం జాతీయ రహదారిపై బరంపురం నుంచి రాజమండ్రి అక్రమంగా ఎనిమిది పశువులను తరలిస్తున్న వాహనాన్ని పోలీసులు పట్టుకున్నారు. ఇద్దరు నిందితులను అదుపులోనికి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్.చిరంజీవి తెలిపారు.

టెన్త్‌కు పక్కాగా ఏర్పాట్లు

జి.సిగడాం : పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేస్తున్నట్లు ఎంఈఓ అరసాడ రవి, తహసీల్దార్ ఎం.శ్రీకాంత్ తెలిపారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ జి.సిగడాం మోడల్ పాఠశాల, జెడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు చెప్పారు.

నేడు పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు

శ్రీకాకుళం పాతబస్టాండ్: అమరజీవి పొట్టి శ్రీరాములు 124వ జయంతి వేడుకలు ఆదివారం శ్రీకాకుళం పాతబస్టాండ్ సమీపంలోని పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తామని తెలిపారు.

పక్కాగా ఏర్పాట్లు..

శ్రీకాకుళం అర్బన్: అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. దీనిలో భాగంగా శనివారం మున్సిపల్ కార్యాలయ సిబ్బంది ట్రాక్టర్‌తో నీరు తెచ్చి పొట్టిశ్రీరాములు విగ్రహాన్ని, మండపాన్ని శుభ్రం చేశారు.

65 ఏళ్ల వయసు.. 70 సార్లు రక్తదానం


రక్తదానం చేస్తున్న రమణమూర్తి

శ్రీకాకుళం కల్చరల్: నగరానికి చెందిన రిటైర్డ్ ఎస్‌బీఐ ఉద్యోగి చల్లా రమణమూర్తి రక్తదానంలో అందరికీ స్ఫూర్తిగా నిలుస్తున్నారు. 65 ఏళ్ల వయసు గల ఈయన శనివారం రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంకుకు వచ్చి 70వ సారి రక్తదానం చేశారు. గత 17 ఏళ్లుగా ప్రతి మూడు, నాలుగు నెలలకు ఒకసారి రక్తదానం చేస్తున్నానని చెప్పారు. మొదట్లో రక్తదానంపై అపోహలు ఉండేవని, తర్వాత తన కంటే పెద్ద వయస్సులోఉన్న మేనేజర్ రక్తం దానం చేయడం చూసి స్ఫూర్తి పొందానని తెలిపారు.

సమరయోధుల పుణ్యక్షేత్రం



బాల్యం నుంచే దేశభక్తిని అలవర్చుకునేందుకు శ్రీకాకుళం నగరంలోని గాంధీ మందిరం స్వాతంత్ర సమరయోధుల స్మృతివనం ఎంతగానో దోహదపడుతుందని స్కౌట్స్ అండ్ గైడ్స్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ రజియా బేగం, నాగిరెడ్డి అన్నారు. జిల్లా స్కౌట్ అధికారులతో కలిసి గాంధీ మందిరాన్ని శనివారం సందర్శించారు. జిల్లా స్కౌట్ సమన్వయకర్తలు రాజేంద్రప్రసాద్, వాగ్దేవి, బుజ్జి పాల్గొన్నారు.

– శ్రీకాకుళం అర్బన్

స్నేహితుడి కుటుంబానికి సాయం



దేవరవలస గ్రామానికి చెందిన కె.ఈశ్వరరావు కుమారుడు అశోక్ ఇటీవల సముద్ర స్నానానికి వెళ్లి గల్లంతై మృత్యువాతపడ్డాడు. విషయం తెలుసుకున్న 1990–91 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు శనివారం స్నేహితుడి కుటుంబాన్ని పరామర్శించి రూ.55 వేలు సాయం అందజేశారు.

– జి.సిగడాం

పాదాలమ్మ ఉత్సవాలకు సన్నద్ధం



శ్రీకాకుళం కల్చరల్: బాకర్‌సాహెబ్‌పేట గ్రామదేవత పాదాలమ్మ ఉత్సవాలు ఈ నెల 16 నుంచి 18 వరకు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గామహాలక్ష్మీ అమ్మవారి ఆలయాన్ని విద్యుత్ లైట్లతో సుందరంగా అలంకరించారు. మూడు రోజుల పాటు సాంస్కృతిక కార్యక్రమాలు కొనసాగుతాయని, ముగింపునాడు అమ్మవారి ఊరేగింపు జరుగుతుందని కమిటీ సభ్యులు తెలిపారు.

వెంకన్నకు ప్రత్యేక పూజలు



శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని మొండేటి వీధి వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు పట్నాల రామకృష్ణ శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో సుప్రభాతసేవ, అష్టోత్తర శతనామాలతో పూజలు చేశారు. అనంతరం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు.

సారా కేసులో వ్యక్తికి జైలుశిక్ష

రణస్థలం: రణస్థలం ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ పరిధిలోని సారాతో పట్టుబడిన కేసులో ముద్దాయికి ఏడాది జైలు శిక్ష, రూ.రెండు లక్షల జరిమానా విధిస్తూ కోర్టు తీర్పునిచ్చిందని ఎక్సైజ్ సీఐ ఎల్.అనురాధా దేవి శనివారం తెలిపారు. సీతంపేట మండలం జోడిమానుగూడకు సవర సుధాకర్ 2021 నవంబర్ 23న కారులో 300 లీటర్ల సారా తరలిస్తుండగా ఎక్సైజ పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచారని చెప్పారు. ఈ మేరకు ముద్దాయిని అంపోలులోని జిల్లా కారాగారానికి తరలించినట్లు తెలిపారు.

వినియోగదారుల హక్కులపై అవగాహన


శ్రీకాకుళం పాతబస్టాండ్ సదస్సులో మాట్లాడుతున్న రఘుపాత్రుని చిరంజీవి



ఎచ్చెర్ల: అవగాహన కల్పిస్తున్న పూజారి గోవిందరావు

శ్రీకాకుళం పాతబస్టాండ్: వినియోగదారుల చట్టంపై అవగాహనతోనే స్థిరమైన జీవనశైలి సాధ్యమని వినియోగదారుల వ్యవహారాల కమిషన్ న్యాయమూర్తి రఘుపాత్రుని చిరంజీవి అన్నారు. పౌర సరఫరాలు, సంబంధిత శాఖల ఆధ్వర్యంలో శనివారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల (బాలురు) సెమినార్ హాలులో ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం నిర్వహించారు. సీనియర్ న్యాయవాది, వినియోగదారులు సంఘాల సమాఖ్య అధ్యక్షుడు బగాది రామ్మోహన్‌రావు అధ్యక్షత జరిగిన ఈ కార్యక్రమంలో చిరంజీవి మాట్లాడుతూ మోసాలపై ప్రశ్నించేతత్త్వం కలిగి ఉండాలన్నారు. రామ్మోహన్‌రావు మాట్లాడుతూ ఆన్‌లైన్ మోసాలు కూడా ఈ చట్టం పరిధిలోకే వస్తాయని చెప్పారు. జిల్లా పౌర సరఫరాల అధికారి సూర్యప్రకాష్ మాట్లాడుతూ గ్యాస్ సరఫరా సమయంలో అధిక చార్జీలు వసూలు చేస్తే ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఔషధ నియంత్రణ అధికారి చంద్రరావు మాట్లాడుతూ మందులు కొనే సమయంలో రసీదు తప్పక పొందాలన్నారు. లీగల్ మెట్రాలజీ అసిస్టెంట్ కంట్రోలర్ శంకర్ విశ్వేశ్వరరావు మాట్లాడుతూ కొనుగోలు చేసిన ప్రతి వస్తువుపైనా ఎక్స్‌పైరీ డేట్ తప్పక పరిశీలించాలన్నారు. ఎలక్ట్రానిక్ కాటాతో జరిగే మోసాలను ప్రాక్టికల్‌గా వివరించారు. వైస్ ప్రిన్సిపాల్ ఎం.వి.సత్యనారాయణ మాట్లాడుతూ ఇటువంటి సదస్సులతో విద్యార్థులను చైతన్యవంతం చేయవచ్చన్నారు. కార్యక్రమంలో ఆహార భద్రత అధికారి కె.లక్ష్మి, వినియోగదారుల సంఘ ప్రధాన కార్యదర్శి నర్సింగరావు, బుడుమూరు శ్రీరామ్మూర్తి, ఏఎస్‌ఆర్‌ఏ ప్రెసిడెంట్ గంజి ఆర్.ఎజ్రా, వేదమాత ఎంటర్‌ప్రైజెస్ ప్రతినిధి డబ్బీరు వాసు, లెక్చరర్ రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఎచ్చెర్ల: వినియోగదారులు తమ హక్కులను తెలుసుకోవాలని వినియోగదారుల క్లబ్ గైడ్ టీచర్ పూజారి గోవిందరావు అన్నారు. ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా శనివారం లావేరు మండలం బుడుమూరు ఉన్నత పాఠశాలలో వినియోగదారుల క్లబ్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వస్తువులు కొనేటప్పుడు బిల్లు తప్పక తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఉరిటి శ్రీనివాసరావు, విద్యార్థుల వినియోగదారుల క్లబ్ కార్యదర్శి జల్లు తనుశ్రీ, ఉపాధ్యాయులు పి.తమ్మినాయుడు, ఎం.అనురాధ, కె.వెంకటరావు, కె.చిన్నపెంటయ్య, ఎస్.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

టెక్నాలజీలో మార్పులు గమనించాలి


విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న నిర్వాహకులు

ఎచ్చెర్ల క్యాంపస్ : ప్రస్తుతం టెక్నాలజీలో చోటుచేసుకుంటున్న మార్పులను విద్యార్థులు గమనించాలని చిలకపాలెంలోని శ్రీశివానీ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ వై.శ్రీనివాసరావు అన్నారు. కళాశాలలో వారం రోజుల పాటు నిర్వహించిన వీఎల్‌ఎస్‌ఐ టెక్నాలజీ వర్క్‌షాప్ శుక్రవారంతో ముగిసింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మిషన్ లెర్నింగ్, డోన్ టెక్నాలజీలో వస్తున్న మార్పులను గమనిస్తుండాలన్నారు. పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రిసోర్సుపర్సన్ సురేష్, వైస్ ప్రిన్సిపాల్ జి.టి.చంద్రశేఖర్, హెచ్‌ఓడీ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష కిట్లు వితరణ


కిట్లు అందజేస్తున్న మధు

ఎచ్చెర్ల క్యాంపస్: పదో తరగతి పరీక్షలకు హాజరువుతున్న కుశాలపురం, తోటపాలేం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు శనివారం అక్షయ సేవాసమితి ఆధ్వర్యంలో అట్టలు, పెన్నులు, పెన్సిళ్లతో కూడిన కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా అక్షయ సేవా సంస్థ అధ్యక్షులు బోడిగి మధు మాట్లాడుతూ విద్యార్థులు ఒత్తిడి లేకుండా పరీక్షలు రాయాలని సూచించారు.

సరస్వతీ దేవి విగ్రహావిష్కరణ


విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎంఈఓ

ఎచ్చెర్ల: లావేరు మండలం బయ్యన్నపేట ఎంపీయూపీ పాఠశాలలో ఉపాధ్యాయురాలు శివకుమారి ఆర్థిక సహకారంతో ఏర్పాటుచేసిన సరస్వతీ దేవి విగ్రహాన్ని ఎంఈవో వాగ్దేవి శనివారం ఆవిష్కరించారు. అనంతరం స్వచ్ఛభారత్ నిర్వహించారు. పాఠశాలలో తరగతి గదులను పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎం.శ్రీనివాస్, సర్పంచ్ హేమసుందర్, పీఎంసీ చైర్మన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైభవంగా తాతమ్మ పేరంటాల వార్షికోత్సవం


మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

జి.సిగడాం : మండలంలోని పాలఖండ్యాం పంచాయతీ గంటాపేటలో తాతమ్మ పేరంటాల వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై కుంకుమ పూజలు చేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు ధారబోయిన రెయ్యమ్మ, పలిశెట్టి సూర్యనారాయణ, వెంకటఅప్పారావు, నాయకులు గర్లంకి శ్రీనివాసరావు, ధారభోయిన ధర్మరాజ్, సంతవురిటి, జగన్నాధపురం, పాలఖండ్యాం, నిద్దాం గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆలయ భూమికి హద్దులు నిర్ణయించాలి


పనులు అడ్డుకుంటున్న గ్రామపెద్దలు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్లలో కేశవరెడ్డి పాఠశాలను ఆనుకొని ఉన్న శ్రీవేంకటేశ్వర ఆలయానికి పాతికేళ్ల క్రితం సర్వే నంబర్–10లో 4.08 ఎకరాల ప్రభుత్వ స్థలం కేటాయించారు. ఈ స్థలం పక్కన ఉన్న వారు పొక్లెయినర్‌లో తవ్వకాలు చేసి భూమి సాగు చేస్తున్నారు. మరో పక్క కొండ ను సైతం కొంతవరకు తవ్వుతుండటంతో ఎచ్చెర్లకు చెందిన గ్రామపెద్దలు, నాయకులు శనివారం అడ్డుకున్నారు. ముందుగా ఆలయానికి కేటాయించిన స్థలానికి హద్దులు నిర్ణయించాలని ఇన్‌చార్జి తహశీల్దార్ బి.గోపాలరావుకు శనివారం వినతిపత్రం అందజేశారు. సర్వే పూర్తయ్యే వరకు తవ్వకాలు జరపకుండా నిలిపివేయాలని కోరారు. ఈ మేరకు అప్పట్లో జిల్లా కలెక్టర్‌గా ఉన్న అనిల్ చంద్రపునీఠా కేటాయించిన స్థల పత్రాలను సైతం తహశీల్దార్‌కు చూపించారు. సోమవారం జిల్లా కేంద్రంలో జరిగే గ్రీవెన్స్‌సెల్‌లో సైతం ఫిర్యాదు చేస్తామని చెప్పారు.